రేషన్.. పరేషాన్

అరకొర కందిపప్పుతోనే సరి ● డిపోకి వంద కిలోలేనట ● అందరికీ అందక కార్డుదారుల గగ్గోలు

కేవలం 22.7 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా ● ముందు వచ్చిన వారికి ముందు పద్ధతిలో సరఫరా

ఎన్నికలకు ముందు పూర్తి స్థాయిలో కోటా ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు అరకొర సరకులతోనే చేతులు దులిపేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆటో, కారు వాహనాల వారికి వాహనమిత్ర, మహిళలకు సున్నావడ్డీ, అమ్మ ఒడి పేరిట వారివారి ఖాతాల్లో నగదు జమ చేసేది. అలాగే పండగల సమయంలో అన్ని సరకులు అందించేది. ఈ ఏడాది అలాంటివి లేకపోయినా రేషన్ డిపోల ద్వారా అందించే సరకులు కూడా సక్రమంగా అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారు.


అల్లిపురంలో రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

అల్లిపురం: కూటమి ప్రభుత్వం వరుసగా గత ఆగస్టు, సెప్టెంబర్ నెలలు పంచదార ఇవ్వలేదు. ఈ నెల కందిపప్పు కూడా అరకొరగా ఇవ్వడంతో చాలా మందికి కందిపప్పు అందక అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గానికి సంబంధించి సర్కిల్–2 పరిధిలో 152 రేషన్ డిపోలు ఉన్నాయి. వాటికి అక్టోబర్ నెలకు 225 టన్నుల కందిపప్పు కేటాయించారు. కానీ ఇప్పటి వరకు 169 టన్నుల కందిపప్పు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నుంచి రేషన్ డిపోలకు రాగా మొదట వచ్చిన వారికి మొదట పంపిణీ పద్ధతిన ఇచ్చారు. దీంతో రేషన్ డిపోల ద్వారా మొదట వచ్చిన వారికి మాత్రమే కందిపప్పు అందజేశారు. జీవీఎంసీ 32,33,34 వార్డుల్లో 12 వరకు రేషన్ డిపోలు ఉన్నాయి. వాటిలో కొంద మందికి మాత్రమే కందిపప్పు అందింది. తర్వాత వచ్చిన వారికి నేటికీ కందిపప్పు అందలేదు. 15వ తేదీ దాటిపోతున్నా ఇప్పటికీ కందిపప్పు ఇవ్వకపోవటంపై రేషన్ కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బియ్యంతో సరి..

ప్రతి నెల కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. కూటమి నేతలు ఎన్నికల్లో రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి వంద రోజులు దాటిపోయి పండగ కూడా చేసుకున్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించలేదు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గొడౌన్ల తనిఖీల సందర్భంగా తూకంలో తేడా ఉందన్న నెపంతో పంచదార, కందిపప్పు నిల్వలను వెనక్కు పంపేసారు. అంత వరకు బాగానే వుంది. వరుసగా రెండు నెలల పాటు బియ్యం తప్ప రెండో సరకు పూర్తిస్థాయిలో ఇవ్వకపోడం పట్ల ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇక ఈ నెలలో దసరా, దీపావళి పండగలు ఉన్నాయి. కానీ బియ్యంతో పాటు పంచదార కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. సాధారణంగా ఒక్కో డిపోకు వెయ్యి రేషన్ కార్డుల వరకు ఉన్నాయి. కానీ ఒక్కో డిపోకు కందిపప్పు కేవలం వంద కిలోల వంతున మాత్రమే ఇవ్వడంతో కార్డుదారులకు సిబ్బంది సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఒక్కో రేషన్ డీలర్ రూ. 2 లక్షల వరకు డీడీలు చెల్లించారు. ఇప్పుడేమో వంద కిలోల కందిపప్పు మాత్రమే రావటంతో కమిషన్ కింద కేవలం రూ.6,700 మాత్రమే రావడంతో ఇదేమి ఇబ్బందిరా బాబు అంటూ రేషన్ డీలర్లు నిట్టూరుస్తున్నారు. గత నెల సర్కిల్–2 పరిధిలో రైస్ కార్డుదారులకు 200 కిలోల పంచదార మాత్రమే ఇవ్వడంతో పలు డిపోలకు అసలు పంచదార అందని పరిస్థితి నెలకొనడం తెలిసిందే. ఒక వైపు రేషన్ సరకుల పంపిణీ ఆఖరి దశకు చేరుకుంటున్నా, రెండో విడత కందిపప్పు పంపిణీ మాత్రం కానరావడం లేదని కార్డుదారులు, రేషన్ డీలర్లు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. కందిపప్పు ధర బహిరంగ మార్కెట్లో కిలో రూ.190 ఉండగా, సూపర్ బజార్‌లో రూ.185, రైతు బజార్లలో రూ.150కి విక్రయిస్తున్నారు. రేషన్ డిపోల్లో కిలో కందిపప్పు కిలో రూ.67కే ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంది. కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తూ వ్యాన్ల వద్ద గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంచదార.. కందిపప్పు ఏవీ?



కూటమి ప్రభుత్వం రేషన్ సరకులు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. గత నెల పంచదార కూడా ఇవ్వలేదు. ఈ నెలలో కొన్ని డిపోలకు మాత్రమే పంచదార వచ్చిందని చెబుతున్నారు. పండగల సమయంలో కూడా పంచదార, కందిపప్పు ఇవ్వకపోవడం సరికాదు.
– ఎం.వెంకటలక్ష్మి, అల్లిపురం

హామీలు అమలు చేయాలి..



ఈ నెలలో దసరాతో పాటు దీపావళి పండగ కూడా వస్తోంది. ఒకే నెలలో రెండు పండగలు ఉన్నా కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం. ఇచ్చిన కందిపప్పు కూడా ఒక్క పూటలోనే అయిపోయిందని అంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి.
– సీహెచ్ అప్పలనర్సమ్మ, అల్లిపురం

రేషన్ డిపోలు నిర్వీర్యం..



గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా అన్ని సదుపాయాలు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ డిపోలు పటిష్ట పరుస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కాని గత రెండు నెలలుగా కందిపప్పు పూర్తిగా ఇవ్వడం మానేశారు. గత నెలలో పంచదార పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు మండిపోతున్నాయి.
– ఎం.మాధవి, అల్లిపురం

ఆశ్వీయుజ పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి

సత్యదేవుని ఆలయానికి
పెద్ద ఎత్తున తరలి రానున్న భక్తులు


రమా సహిత సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్: అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యం గల ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆశ్వీయుజ పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు తరలి రానున్న దృష్ట్యా చర్యలు చేపట్టారు. వేకువ జాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. ధ్వజ స్తంభ పూజలు జరగనున్నాయి. ఉదయం 7 నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.


ఘాట్‌రోడ్డులో పెండాల్స్ ఏర్పాటు

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సీతమ్మధార: పాఠశాలలో ఉన్న పిల్లలకు క్యారేజీ పట్టుకెళ్తున్న ఒక మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఉదంతమిది. నాలుగవ పట్టణ పోలీసులు తెలిపిసన వివరాలిలా ఉన్నాయి. రైల్వేన్యూకాలనీలో గల పాలాక్స్ స్కూల్లో చదువుతున్న పిల్లలకు స్థానికంగా నివాసం ఉంటున్న మహిళ కుమారి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో క్యారేజీ పట్టుకెళ్తున్నారు. ఇంతలో వెనుక నుంచి ద్విచక్ర వాహనం మీద వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో గల తులం బంగారు చైను తెంపుకెళ్లిపోయారు. చైను లాగేసిన క్రమంలో చైనులో గల వేంకటేశ్వరస్వామి లాకెట్ కింద పడిపోయింది. దీంతో ఆమె నాలుగవ పట్టణ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే క్రైం సీఐ రాజులునాయుడు, ఇతర పోలీసు అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఈ కేసుని క్రైం సీఐ రాజులునాయుడు పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ సుభద్ర దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను రక్షించిన పోలీసులు

అల్లిపురం: కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన మహిళను నగర పోలీసులు కాపాడారు. మంగళవారం ఒక వివాహిత తన భర్త వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు ఆర్కే బీచ్‌లో ఆత్మహత్య చేసుకునేందుకు బీచ్‌లోకి వెళ్లడాన్ని అక్కడే విధుల్లో ఉన్న బీచ్ మొబైల్ పోలీస్, లైఫ్‌గార్డులు గమనించారు. తక్షణమే ఆ మహిళను నిలువరించారు. ఆమె వివరాలు అడిగి తెలుసుకున్న పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కౌన్సెలింగ్ చేపట్టి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీసులను అభినందించారు.

పాఠశాలలు తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ రామారావు

విశాఖ విద్య: మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే క్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు బుధవారం నగరంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని కేడీపీఎం ఉన్నత పాఠశాల, ఎంవీపీలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం రుచి ఎలా ఉందనేది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీఎం పోషన్ కమిటీ సభ్యుడిగా ఇక నుంచి పాఠశాలల్లో అమలయ్యే భోజనం పథకం తీరును ఆకస్మికంగా పరిశీలించినట్టు చెప్పారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కుటుంబం చెంతకు వివాహిత


మహిని పాడేరులో ఆమె కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం: భర్త వేరే పెళ్లి చేసుకోవడంతో ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన పాడేరుకు చెందిన భగత కులానికి చెందిన వివాహితను ఏయూటీడీ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం ముంచంగిపుట్టు మండలం, దారెల పంచాయతీ, రంగలసింగి గ్రామానికి చెందిన సుగ్రీవ్ మహాదేవ్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అతని కుమార్తె కె. మహికి పెళ్లి చేసి పంపించాడు. ఆమె భర్త ఆమెతో నిత్యం గొడవ పడటమే కాకుండా కుమార్తెతో సహా కన్నవారి ఇంట్లో వదిలిపోయాడు. దీంతో ఆమె తన 5 ఏళ్ల కూతురిని తల్లిదండ్రుల వద్ద వదిలిపెట్టి విశాఖపట్నం వచ్చేసింది. రైల్వే స్టేషన్‌లో రెస్క్యూ చేస్తున్న సమయంలో ఆమెను గుర్తించిన ఏయూటీడీ సిబ్బంది ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ మహిళా షెల్టర్‌కు తరలించారు. అక్కడి నుంచి ఆమె రెండు సార్లు తప్పించుకు పోయేందుకు ప్రయత్నించడంతో టూటౌన్ పోలీసులు ఆమెను తీసుకువచ్చారు. ఆమెకు ఒడియా భాష మాత్రమే రావటంతో పాడేరులో పని చేస్తున్న ఆదివాసీ మిత్ర సంస్థ డైరెక్టర్ మన్మథరావుతో మాట్లాడించి ఆమె పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆమె తల్లిదండ్రుల వివరాలు తెలియటంతో ఆమెను కారులో పాడేరు తీసుకెళ్లి తండ్రికి, గ్రామ అధ్యక్షుడు, ఆదివాసీ నాయకులైన పాంగి పాండులకు మంగళవారం అప్పగించినట్లు తెలిపారు.

ఇన్‌చార్జి పాలనలో ఫోర్త్‌టౌన్ క్రైం స్టేషన్


ఖాళీగా ఉన్న ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్ఐ సీటు

సీతమ్మధార: నగరంలోనే ఎంతో కీలకమైన నాలుగవ పట్టణ క్రైం పోలీసు స్టేషన్‌లో నెల రోజులుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ స్టేషన్ పరిధిలో తరచూ పలు దొంగతనాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ క్రైం ఎస్ఐగా పని చేసిన భాస్కరరావు సెప్టెంబర్ 15వ తేదీన పీఎం పాలెం స్టేషన్‌కి బదిలీపై వెళ్లిపోయారు. అంత వరకు బాగానే వుంది. అప్పటి నుంచి రెండో పట్టణ క్రైం ఎస్ఐ సునీల్‌కి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాని ఆయన రెండు స్టేషన్ విధులతో సతమతం అవుతున్నారు. క్రైం విభాగంలో ఒక ఏఎస్ఐ, హెచ్‌సీలు నలుగురు ఉండగా, కానిస్టేబుళ్లు 14 మందికి గాను 10 మంది ఉన్నారు. పూర్తిస్థాయి ఎస్ఐ లేకపోవడంతో హెడ్ కానిస్టేబుల్ కేసులు కట్టాల్సిన దుస్థితి నెలకొందని స్టేషన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఫలితంగా వీరంతా పని ఒత్తిడితో సతమతం అవుతున్నారు. నమోదు చేసిన కేసులపై సైతం ఇన్‌చార్జి ఎస్ఐ సంతకాలు చేయకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నెలలో ఇప్పటికే ఎనిమిది కేసులు నమోదు కావడం గమనార్హం. స్టేషన్ పరిధిలో దొండపర్తి, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, లలితానగర్, డైమండ్ పార్కు, రైల్వే న్యూకాలనీ, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఫోర్త్ టౌన్ క్రైం విభాగంలో ఎస్ఐ పోస్టుని భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

సొంత నిధులతోనే పోర్టు ఆస్పత్రి నిర్వహించాలి


పోర్టు ఆస్పత్రి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతోనే నిర్వహించాలని, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలనే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 15వ రోజుకు చేరాయి. మంగళవారం దీక్షలను సీఐటీయూ ఆలిండియా ఫెడరేషన్ కార్యదర్శి బి. జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పోర్టు ట్రస్ట్ ఏర్పడి 50 ఏళ్లు అయిన సందర్భంగా పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ఏర్పడిందని, దీని ఏర్పాటుకు కార్మికులు రక్తాన్ని ధార పోసారని, కానీ కార్మికుల కష్టాలను మరిచి ఇప్పుడు దీనిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. ఈ దీక్షలలో సీఐటీయూ నాయకులు కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ, బి. లక్ష్మణరావు, కెఎస్ కుమార్, శంకర్రావు, నాయుడు, రాఘవులు, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలో ఓ కారు ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బీఆర్‌టీఎస్ రోడ్డులో స్కిల్ డెవెలప్‌మెంట్ కూడలి నుంచి ఆరిలోవ కాలనీకి ఓ కారు మితిమీరిన వేగంతో వస్తోంది. అదుపు తప్పిన ఆ కారు శివాజీనగర్ శివాలయం ఎదురుగా శ్రీకాంత్‌నగర్‌కు తిరిగే మలుపు వద్ద డివైడర్‌ను ఢీకొంది. దీంతో పల్టీలు కొట్టింది. వెంటనే స్థానికులు కారు వద్దకు చేరుకొని కారులో ఉన్న ఇద్దరు యువకులను బయటకు తీశారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకొన్నారు. కారు ముందు భాగం నుజ్జయింది. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచ విద్యార్థి దినోత్సవం జరిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, పలువురు అధ్యాపకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కలాం పట్టుదల, కృషిని కొనియాడారు. కలాం జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని తమ ప్రతిభ పెంచుకోవాలని, భవిష్యత్ నాయకులుగా మారే దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ పీఎల్ శరణ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ భద్రత తనిఖీలు


ఆరిలోవలో గ్యాస్ సిలిండర్, పైపు తనిఖీ చేసి ఓటీపీ నమోదు చేస్తున్న డెలివరీ బాయిలు

ఆరిలోవ: ఎల్‌పీజీ గ్యాస్ సిబ్బంది కస్టమర్ భద్రతా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఆరిలోవ ప్రాంతంలో హెచ్‌పీ గ్యాస్ వినియోగదారుల నివాసాలకు గ్యాస్ డెలివరీ బాయ్స్ వెళ్లి తనిఖీలు చేశారు. వంట గదిలో గ్యాస్ పైపు, గ్యాస్ సిలిండర్ చెక్ చేశారు. పైపునకు లీక్‌లు ఎక్కడ ఉన్నాయో పరిశీలించారు. లీకవుతున్న పైపులను వెంటనే మార్చుకోవాలని సూచించారు. వంట గదిలో గ్యాస్‌ను సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. గ్యాస్ తనిఖీ అనంతరం వివరాలను వినియోగదార్ల ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేశారు.

అలేఖ్యకు బంగారు పతకం


అలేఖ్యను అభినందిస్తున్న కామేశ్వరరావు

మహారాణిపేట: డెహ్రాడూన్‌లో అక్టోబర్ మొదటి వారంలో జరిగిన జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖలోని గాయత్రీ విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.అలేఖ్య బంగారు పతకం కైవసం చేసుకుంది. పోటీలను అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ సమాఖ్య పర్యవేక్షణలో కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించాయి. అలేఖ్య టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందింది. అలేఖ్యను గాయత్రి విద్యా పరిషత్ సంయుక్త కార్యదర్శి డీవీఎస్ కామేశ్వరరావు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని ప్రియవర్షిని జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌నకు ఎంపికైనట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

● యూపీహెచ్‌సీ సేవలపై ఆరా


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్


పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్


అంగన్‌వాడీని పరిశీలిస్తున్న కలెక్టర్

సీతమ్మధార: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. స్థానిక రేసపువానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని, సరకుల నిల్వలను పరిశీలించారు. పిల్లల నేమ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. వారితో సరదాగా గడిపారు. తనిఖీలో భాగంగా నిర్వాహకులతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. నెలవారీ సరకులు, టీహెచ్ఆర్, కేంద్రానికి వస్తున్న చిన్నారులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. లోపాలు తలెత్తకుండా సరకులు అందజేయాలని, చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అక్కడి వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజ్యలక్ష్మి, ఆయా వున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి..

ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం సేవలందించాలని, సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. పాత రేసపువానిపాలెంలోని యూపీహెచ్‌సీని మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను గమనించారు. ఓపీ సంఖ్య, అందుబాటులో ఉన్న మందుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడికి విచ్చేసిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల హాజరు పుస్తకాలు, ఇతర రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి మన్మోహన్, సిబ్బంది ఉన్నారు.

పురాతన వస్తువుల ప్రదర్శనకు ప్రశంసలు


శివప్రకాష్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న పైడితల్లి అమ్మవారి ఉత్సవ కమిటీ ప్రతినిధులు

మద్దిలపాలెం: నగరానికి చెందిన సహకార బ్యాంకు విశ్రాంత ఉద్యోగి జీఎస్ శివప్రకాష్ పురాతన వస్తువులు, నాణాలు, స్టాంపులు సేకరణలో దిట్ట. వివిధ జిల్లాలలో తరచూ ప్రదర్శనలు వచ్చి విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటారు. ఈ క్రమంలో విజయనగరం పైడితల్లమ్మ అమ్మవారి ఉత్సవంలో ఈ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ సేద్ మాధవన్ ఆదేశానుసారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయనగరం ఉత్సవాల్లో శివప్రకాష్ పురాతన నాణేలు, వస్తువులను ప్రదర్శించారు.పలువురు ప్రముఖులు తిలకించి శివప్రకాష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు.

గొప్ప చరిత్రకారుడు గద్దర్

విశాఖ సిటీ: ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప చరిత్రకారుడు గద్దర్ అని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గద్దర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు, బహుజనుల కోసం తన జీవితాంతం సాహిత్య సేవ చేశారని గుర్తు చేశారు. విశ్రాంత ఆచార్యులు ఒ.జాన్ మాట్లాడుతూ ఈ నెల 20 ఉదయం 10 గంటలకు టీఎల్ఎన్ సమావేశ మందిరంలోను, మధ్యాహ్నం 2 గంటలకు పౌర గ్రంథాలయంలో గద్దర్ సభ జరుగుతుందని తెలిపారు.